
ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025
5
పార్వతీపురం మన్యం



ఏకలవ్య పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భామిని, మెలియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. aptwgurukulam.ap.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాత పరీక్ష ఆరో తరగతికి వంద మార్కులకు, తెలుగు ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రపంచాన్నే మార్చగలిగే శక్తిమంతులు బాలికలు

- బాల్య వివాహాలను నిరోధించాలి
- రక్తహీనతను రూపుమాపేందుకు కృషి
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

బాలికల హక్కులను పరిరక్షిస్తూ, వారి అవసరాలను తీర్చగలిగితే సమాజంతో పాటు, ప్రపంచాన్ని మార్చకలిగే శక్తివంతులు బాలికలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభిప్రాయపడ్డారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడ బిడ్డ అంటే భారం కాదని బలమైన, ధైర్యవంతులైనవారని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం, బాలికల సాధికారతకు ప్రతి ఆడపిల్లను చదివించి, వారిని సంరక్షించాలన్నదే బేటీ బచావో - బేటీ పఢావో లక్ష్యమన్నారు. జిల్లాలో రక్తహీనత ఎక్కువగా ఉందని, దీన్ని నిరోధించేందుకు బలవర్ధకమైన ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. జిల్లాలో బాల్యవివాహాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో తల్లితండ్రుల్లో మార్పు తీసుకురావడం ద్వారా నిరోధించవచ్చని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. 220 మంది అనాథ పిల్లలకు నెలకు రూ.4వేలు చొప్పున ఆరు మాసాలకు కలిపి రూ.50 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. జిల్లాలో ఆడపిల్లలు చదివే ప్రతి వసతి గృహం, పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. లక్ష రూపాయల ఖర్చుతో ప్రతీ అంగన్వాడీ కేంద్రానికి తాగునీరు, మరుగుదొడ్డి ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్న సంగతిని మంత్రి గుర్తు చేశారు. సర్వేకల్ కేన్సర్ నుంచి రక్షణ పొందేందుకు హెచ్‌పివి వేక్సినేషన్ కార్యక్రమం విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఇప్పటికే రక్తహీనత ఉన్న మహిళలకు ఇంజక్షన్ ద్వారా ఒక గ్రాము రక్తం పెరిగేలా చర్యలు తీసుకున్న సంగతిని ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ల్యాప్ టాప్, అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం ప్రొసీడింగ్సును, రక్తహీనత కలిగిన గర్భిణీలకు, మహిళలకు ఆహార కిట్లను పంపిణీ చేశారు. రక్తహీనత నివారణ దిశగా అమ్మకు అమృత ఆహారం, బేటీ బచావో - బేటీ పఢావో గోడ పత్రికలను కలెక్టర్, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కిశోరి బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన ఆమె గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు.

ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ నేటి సమాజంలో లింగ వివక్ష ఉండరాదని, అమ్మాయిలను బాగా చదివించి, ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లితండ్రులను కోరారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఆడపిల్లకు చదువు తప్పనిసరి అని, విద్యకోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిపిస్తున్నారని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు లేని సమాజమే లేదన్నారు. ఆత్మవిశ్వాసంతో చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించిన మహిళా మణులు ఎందరో ఉన్నారని, వారంతా నేటి కిశోరి బాలికలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆడపిల్లలు సాధికారిత సాధించాలనే దిశగా గత పదేళ్లుగా బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంగతిని వివరించారు. ఈ ఏడాది జనవరి 22 నుంచి మార్చి 8 వరకు ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతుందని అన్నారు. జిల్లాలో రక్తహీనత ఎక్కువగా ఉందని, దీని నివారణ కొరకు బలవర్ధకమైన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులూ మధ్యాహ్న భోజన పథకంతో పాటు ఆకుకూరలు, గ్రుడ్లు తప్పక తీసుకొని, రక్తహీనతను పారద్రోలేందుకు చేయీ చేయీ కలపాలని కలెక్టర్ అభిలషించారు. కార్యక్రమంలో ట్రైకార్ కార్పొరేషన్ సంచాలకులు పువ్వల లావణ్య, కాపు కార్పొరేషన్ సంచాలకులు గండి రామినాయుడు, కొప్పులవెలమ కార్పొరేషన్ సంచాలకులు గొట్టాపు వెంకట నాయుడు, ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి, పిఒ టి.కనకదుర్గ, సిడిపిఒలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



బాలికలతో కలిసి అభినవాదం చేస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాస్వామ్యానికి ఓటే కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

దేశ పటిష్ట ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటు హక్కు ఎంతో కీలకమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఆర్‌సిఎం కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టరేట్ వరకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్లకార్డులను ప్రదర్శించి ఓటు హక్కు కాదు మన బాధ్యత కూడా, నిజాయితీగా ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి నినాదాలతో విద్యార్థినీ, విద్యార్థులు చైతన్య ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో 7,81,898 మంది ఓటర్లు కలిగియున్నారన్నారు. ఉన్నత విద్య కోసం వేరే ప్రాంతాలకు వెళ్లే యువత ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటర్ల వినియోగ శాతం 80 నుంచి 82 వరకు నమోదు కాగా ఇంకా పెరగాల్సి బాధ్యత అందరిపై ఉంద న్నారు. యువత ఓటు హక్కు నమోదుతో పాటు ఓటు హక్కు లేని వారికి ఓటరుగా నమోదు చేయడంలో భాగస్వా మ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వా మ్యం పరిడవిల్లాలని ఆకాంక్షిం చారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఫోటో ఓటరు గుర్తింపు కార్డు లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కొత్త ఓటర్ల నమోదులో సమర్థవం తంగా పనిచేసిన బిఎల్ఒలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం, ఉపన్యాసం వంటి పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అంద జేశారు.

కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, తహశీల్దార్ జె.జయలక్ష్మి, ఉప తహశీ ల్దార్ పి.కిరీటి, కళాశాల ప్రిన్సిపల్ రామా రావు, జెబి తిరుమలాచార్యులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నేడు గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణతంత్ర వేడుకలు ఆదివారం జరగనున్నాయి. ఉదయం 9గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను ఆహ్వానించి జాతీయ పతాకావిష్కరణ చేసిన అనంతరం పోలీసుల నుంచిగౌరవ వందనం స్వీకరిస్తారు. కలెక్టర్ సందేశం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల పరిచయాలు, వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, ఉద్యోగులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాల బహుకరణ, అనంతరం వివిధ శాఖల స్టాల్ ప్రదర్శనతో కార్యక్రమం ముగుస్తుంది. సాయంత్రం 4.30 గంటలకు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తేనెటి విందు ఉంటుంది.




రిపబ్లిక్‌డే సందర్భంగా విద్యుత్‌కాంతులతో ముస్తాబైన కలెక్టరేట్

ఉపాధి అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

జియ్యమ్మ వలస మండలంలో ఉపాధి పనులు చేసిన చోట బోర్డులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.42లక్షల 66వేలు కేటాయిస్తే బోర్డులు ఏర్పాటు చేయకుండానే లక్షల రూపాయల బిల్లులు చేసి ఫీల్డ్ సిబ్బంది దగ్గర నుంచి మండల ఉపాధి అధికారుల వరకు అక్రమాలకు పాల్పడ్డారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. ఆదివారం జియ్యమ్మవలసలో మండల సిపిఎం కార్యదర్శి కె.సీతారాం, కమిటీ సభ్యులు బి. మోహన్‌రావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఉపాధి పనులు చేసిన చోట తప్పనిసరిగా బోర్డు లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చెబుతుందని, అందుకు కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నా ఉపాధి సిబ్బంది ఎక్కడా బోర్డులు ఏర్పాటు చేయడం లేదన్నారు. పాత బోర్డులనే చూపించి కొత్తగా బోర్డులు ఏర్పాటు చేసినట్లు డబ్బులు కాజేస్తున్నారన్నారు. అలా ఈ మండలంలో సుమారు బోర్డులు ఏర్పాటు చేయకుండా రూ.8.10 లక్షలు స్వాహా చేసినట్టు రికార్డులు చెబుతున్నాయన్నారు. మక్కువ మండలంలోనూ బోర్డులు ఏర్పాటు చేయకుండా వేసినట్లు సోషల్ ఆడిట్ సామాజిక తనిఖీలో తేలిందని తెలిపారు. దీంతో అధికారులు రికవరీ పెట్టినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ఇక జియ్యమ్మవలస మండలంలో శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ చర్చలో అటువంటి చర్చ రాలేదన్నారు. దంగభద్రలో రూ.36 వేలతో బోర్డులు ఏర్పాటు చేసినట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీకాంత్ పేరున డబ్బు తీశారని, అయితే అక్కడ బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. ఇలా మండలంలో 31 పంచాయతీలకు గాను 27 పంచాయతీల్లో రూ.8.10 లక్షల స్వాహా చేస్తే సోషల్ ఆడిట్ ఎలా చేశారని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు అక్రమాలు జరుగుతుంటే వేలల్లో రికవరీ కట్టించి తూ, తూ మంత్రంగా ఆడిట్ చేస్తున్నారని విమర్శించారు. చేయని పనికి బిల్లులు చేయడమేమిటని, ఆ తర్వాత రికవరీ కట్టడమేమిటని ప్రశ్నించారు. చేయని పనికి బిల్లు చెల్లించిన అధికారులు అందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా జిల్లా మొత్తం ఎన్ని పనులకు ఎన్ని బోర్డు లు ఏర్పాటు చేశారు, ఎంత డబ్బు మంజూరైందని, ఎంత డబ్బు బిల్లు చేశారనే వివరాలు వెంటనే జిల్లా అధికారులు పత్రికా ముఖంగా తెలియజేయాలని, లేకుంటే జిల్లా మొత్తం ఇలాగే అక్రమాలు జరిగినట్లు అనుకోవాల్సి వస్తుందని అన్నారు. జియ్యమ్మ వలస మండలంలో బోర్డుల ఏర్పాటు కోసం చేసిన బిల్లులపై సమగ్ర దర్యాప్తు జరిపించి ఫీల్డ్ సిబ్బందే కాకుండా, అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. లేక పోతే భవిష్యత్‌లో ప్రజలందరినీ కదిలించి పెద్ద ఎత్తున పోరాడతామని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

ఎవర్ని అడిగి కమిటీలో పేర్లు చేర్చారు?

ఉత్సవ కమిటీపై భగ్గుమన్న అసంతృప్తి జ్వాలలు

ప్రజాశక్తి - మక్కువ

ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే పోలమాంబ జాతర మూడు రోజుల పాటు కొనసాగేలా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలో ఎవరిని అడిగి తమ పేర్లను చేర్చారని ముగ్గురు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. దేవాదాయశాఖ విడుదల చేసిన పోలమాంబ ఉత్సవ కమిటీలో పుర్రు నారాయణ, అక్యాన గణపతిరావు, రెడ్డి వెంకటరమణ పేర్లతో కూడిన 8మంది కమిటీ సభ్యులు జాబితాను ప్రకటించారు. అయితే ఆ ముగ్గురు ఏ విధమైన కార్యక్రమంలో పాల్గొన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా పార్టీకి సేవలు చేసిన వారిని పక్కన పెట్టి ఎవరి సలహాలు, సూచనలు తీసుకోకుండానే హడావుడిగా కమిటీని ఏర్పాటు చేసినట్టు ప్రకటించడమేమిటిని, చరిత్రలో ఎక్కడా ఇలాంటి కమిటీలు చూడలేదని పలువురు టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా ఇలాంటి ఒంటెత్తుపోకడ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని తెలుగు తమ్ముళ్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పోలమాంబ జాతరకు నాలుగు రోజుల సమయం ఉండగా అసంబద్ధమైన కమిటీలు వేసి అల్లర్లకు తావిచ్చేలా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం పరోక్షంగా జాతర ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉందని వారంతా లోలోన మదన పడుతున్నారు. మక్కువ మేజర్ పంచాయతీ తర్వాత పెద్ద గ్రామమైన శంబరలో పార్టీకి ఎదురుగాలు సమయంలో కూడా టిడిపి ఓ ఎంపిటిసి స్థానాన్ని కైవసం చేసుకున్నంది. పార్టీకి పట్టుగొమ్మగా ఉన్న గ్రామాన్ని ముక్కలు చేయాలని తీసుకునే నిర్ణయాలు సరికావని, వీటిని పార్టీ పెద్దలు గ్రహించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువరసకు చెందిన దళితులు సాగు చేస్తున్న భూములను సర్వే చేసి పట్టాలివ్వాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యాన దళితులు శనివారం హెచ్ డిటి భాను ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరాసవలస గ్రామ దళితులు మాట్లాడుతూ తమ గ్రామానికి సమీపంలో గల ప్రభుత్వ భూమిని గత 40ఏళ్లుగా సాగు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో సాలూరు పట్టణానికి చెందిన వ్యాపారి సుతాపల్లి రాము ఈ భూములపై కన్నేసి తమపై దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నారని చెప్పారు. తాము సాగు చేస్తున్న భూములను అన్యాక్రాంతం చేయడానికి యంత్రాలను తీసుకురాగా అడ్డుకున్నామని తెలిపారు. అయితే సదరు వ్యక్తి అధికార పార్టీ అండతో సాగు చేస్తున్న భూములను వదిలేయాలని బెదిరిస్తున్నారని తెలిపారు. సుతాపల్లి రాము ప్రోత్సాహంతో మా పక్క గ్రామం గుర్రపువలస నుండి కొంతమంది తాము సాగు చేస్తున్న భూములపై చొరబడి టేకు మొక్కలను నరికేశారని చెప్పారు. అధికారులు సదరు వ్యాపారి భూ ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు

చురుగ్గా పోలమాంబ జాతర ఏర్పాట్లు


పటిష్టంగా క్యూలైన్లు
రేయింబవళ్లు ప్రసాదాల పోటు

ప్రజాశక్తి - మక్కువ

ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న పోలమాంబ అమ్మవారి రాష్ట్ర జాతరకు దేవాదాయశాఖ చకచకా ఏర్పాట్లు చేస్తుంది. పోలమాంబ ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. చదురు, వనం గుడుల వద్ద క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనంతో పాటు శీఘ్రదర్శనాలకు సంబంధించి క్యూ లైన్ పనులను 90 శాతం మేరకు పూర్తి చేశారు. గతం కంటే భిన్నంగా ఈసారి విశాలమైన ఫ్లాట్ ఫారాలతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా పంచాయతీరాజ్, ఉపాధి హామీ శాఖల ద్వారా రూ.2.40కోట్లు ప్రభుత్వ నిధులను వెచ్చించి రహదారుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరోవైపు పోలమాంబను దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికుల కోసం అమ్మవారి ప్రసాదాలను అందించేందుకు స్థానికంగా పోటు ఏర్పాటు చేసి రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ప్రధాన జాతరతో పాటు మిగిలిన 9 వారాలకు సరిపడేలా సుమారు 30వేల నుంచి 50వేల వరకు లడ్డూలు సిద్ధం చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఆలయాల క్యూ లైన్లు, భక్తులు తిరిగే ప్రధాన వీధుల్లో దేవాదాయ శాఖ సిసి కెమెరాలు కూడా సిద్ధం చేసింది.

ఆ ఉద్యోగి లోటు కట్టొచ్చినట్లుంది..!

పోలమాంబ జాతర సమయంలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆ ఉద్యోగి లేని లోటు కట్టి వచ్చినట్లు కనిపిస్తుందని ఇఒ వి వి సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడిన దేవదర్శన గుమస్తా మురళీకృష్ణ ఇంకా కోలుకోలేదు. దీంతో ఆయన విధులకు దూరంగా ఉన్నారు. జాతర సమయంలో సర్వం తానై అన్న రీతిలో ఇక్కడ పనులన్నీ చక్కబెడుతూ ఉన్నతాధికారులకు చేదోడు వాదోడుగా నిలిచేవారు. ఆయన లేకపోవడంతో పాలకొండ, తోటపల్లి ఇతర దేవస్థానాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై తెచ్చినప్పటికీ వారికి ఇక్కడ జాతర కొత్త కావడంతో కాస్త ఇబ్బందులు తప్పడం లేదన్నారు



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

రాజ్యాంగ పరిరక్షణ విద్యార్థుల కర్తవ్యం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పాలకొండ

రాజ్యాంగ పరిరక్షణే విద్యార్థుల ప్రధాన కర్తవ్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ అన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి యల్లాం జంక్షన్ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో అంబేద్కర్ ఫోటోను చేతపట్టి విద్యార్థులు ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.డేవిడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులం పేరుతో విద్య, ఆస్తి, ప్రాథమిక హక్కులు లేకుండా చేసి, పశువుల కంటే హీనంగా, కట్టు బానిసలుగా దోపిడీ చేసిందన్నారు. దారుణంగా అణచివేయబడ్డ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సామాజిక తరగతులకు స్వాతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగం అందరికీ విద్యా హక్కు కల్పించిందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్ కల్పించిందన్నారు. చట్టం ముందు అంతా సమానమేనని ప్రాథమిక హక్కులు కల్పించిందని, అయితే మళ్లీ మన రాజ్యాంగ హక్కులపై దాడి జరుగుతోందని అన్నారు. అందుకే రిపబ్లిక్ డే సందర్భంగా మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, రాష్ట్రం హక్కు కేంద్రం లాగేసిందని విమర్శించారు. ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన చేతుల్లోకి తీసు కొని ముక్కలు చేసివచ్చే విద్యా సంవత్సరం నుండి వేల ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. బిజెపి అమలు చేస్తున్న ఎన్ఇపిలో భాగమే ఈ కుట్ర అన్నారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడమే ఈ మార్పుల సారాంశమని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని, రాష్ట్రం హక్కులు, లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని రక్షించు కోవాలన్నారు. అందులో భాగంగా రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా అంతటా ప్రదర్శనలు జరిపి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేద్దామన్నారు. విద్యార్థిని, విద్యార్థులంతా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, మండల కార్యదర్శి కె.రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.దుర్గారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మంజు, దిలీప్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సంజీవ్, గౌతమ్, అరుణ్, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి వీరఘట్టం

ఉన్నత పాఠశాలలకు మూడు కిలోమీటర్ల దాటిన ఉన్న గడగమ్మ, కిమ్మి, తూడి, చిదిమి ప్రాథమికోన్నత పాఠశాలలను యధావిధిగా కొనసాగించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలను నాలుగు, ఐదు కిలోమీటర్ల దూరానున్న ఉన్నత పాఠశాలలకు తరలించడం దారుణమన్నారు. దీనివల్ల డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.క ఆవున అధికారులు, ప్రభుత్వం పునరాలోచించి ఈ పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.


సైన్సు ఫేయిర్‌లో తలవరం పాఠశాలకు గుర్తింపు

ప్రజాశక్తి వీరఘట్టం

పుదుచ్చేరిలో ఈనెల 20 నుంచి 25 వరకు జరిగిన సాధరన్ ఇండియసైన్స్ ఫెయిర్‌లో మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు లభించినట్లు ప్రధానోపాధ్యాయులు వై.జగన శనివారం తెలిపారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు జి.రామారావు మార్గ దర్శకత్వంలో 9వ తరగతి విద్యార్థులు నితిన్ కుమార్, గోవిందరావు తయారుచేసిన నాన్ మోటార్ వాటర్ పంప్ ప్రాజెక్టుకు రెండో స్థానాన్ని సాధించడంతో పుదిచ్చేరు స్పీకరు, విద్యాశాఖ మంత్రి చేతుల మీద ట్రోఫీ రూ.5 వేల నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. వీరిని ఎంఇఒలు గౌరు నాయుడు, ఆనందరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడమే స్వచ్ఛాంధ్రా!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి, ఆ పని అధికారులు, ప్రజలపైకి నెట్టేయడానికేనా? ప్రభుత్వం స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని తెరపైకి తెస్తోంది? అంటే ముమ్మాటికీ ఇదే కారణమనే సమాధానం వినిపిస్తోంది. స్వచ్ఛాంధ్రా - స్వచ్ఛ దివాన్ పేరిట ఈనెల 18న గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టిన సంగతి తెసిందే. పరిసరాల పరిశుభ్ర అందరి బాధ్యత అని కొందరు, ఇక నుంచి ప్రభుత్వం ఆధ్వర్యాన ప్రతి మూడో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మరికొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన సంగతి తెలిసిందే. కలెక్టరేట్‌లో సైతం గడిచిన శనివారం ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ మాటలు, చేతల్లో తప్పేమీ లేదు. కానీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విషయంలో ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ ఎంత? చిత్తశుద్ధి ఎంత? అన్నదే ఇక్కడి ప్రశ్న. ప్రభుత్వం చెప్తున్నట్టుగా ఎవరికి వారే స్వచ్ఛత పాటించే పరిస్థితి ఉందా? ఉంటే పరిశుభ్రత పేరిట జిల్లాలో కోట్ల రూపాయల పేరిట ఎందుకు కేటాయింపులు ఎందు చేయాలి? ప్రజలే క్లీన్ అండ్ గ్రీన్ చేస్తే పారిశుధ్య కార్మికులను పెట్టుకోవాల్సిన అవసరం ఎందుకు వస్తుంది? ప్రజారోగ్యానికి ఉన్న ప్రాధాన్యతే ఇందుకు కారణం. కానీ, ఆ రకమైన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంటోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యానికి అంటే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, కాలువల్లో పూడిక తీత, బ్లీచింగ్ వంటివాటికి ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధించింది. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వమూ బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి ఏటాటేటా కొత విధించింది. దీన్ని ఆసరాగా చేస్తున్న అధికార యంత్రంగా కూడా వచ్చిన అరకొర నిధుల్లో చిలకొట్టుడు వ్యవహారాలకు దిగుతోంది. ఫలితంగా గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లడం లేదు., తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. తాగునీటి క్లోరినేషన్ కూడా సరిగా జరగని పరిస్థితి దాపురిస్తోంది. ఫలితంగా గ్రామాల్లో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎప్పటికప్పుడు ఇటీవల కాలంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి కేసులు పెరుగుతున్నాయి. ఇటువంటి కారణాలతోనే ఇటీవల కాలంలో బొండపల్లి మండలం బిల్లలవలసలోనూ, కురుపాం మండల కేంద్రంలోనూ డయేరియా ప్రభలిందనడంలో సందేహం లేదు. ఈ ఘటనలో తాజాగా పైడమ్మ అనే మహిళ శుక్రవారం రాత్రి మృతిచెందింది. అంతకు ముందే సుమారు 16మంది డయేరియాతో ఆసుపత్రులపాలయ్యారు. అంతకు ముందు (మూడు నెలల క్రితం) గుర్ల మండల కేంద్రంలో సుమారు 10మంది డయేరియాతోనే చనిపోయారు. అనంతరం జనసేన అధితనే, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, టిడిపికి చెందిన జిల్లా మంత్రి, వైసిపికి చెందిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆ గ్రామాన్ని సందర్శించి ప్రజారోగ్యం క్షీణించడం, మరణాలపట్ల మొసలి కన్నీరు కార్చడం తప్ప, అందుకు గల మూలాలను తెలుసుకుని, సురక్షితమైన నీటిని అందించేందుకు, పారిశుధ్య నిర్వహణ మెరుగు పర్చేందుకు మాత్రం ప్రయత్నించ లేదు. తాజాగా స్వచ్ఛాంధ్రా పేరిట ప్రజారోగ్యాన్ని తెగకాపాడేస్తున్నట్టు ప్రచారం అధికార పక్షం చేస్తుంటే, వైసిపి ఒకే తానులో ముక్కలా వ్యవహరిస్తోంది. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా స్థానిక పాలకులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారని, ఈబాధ్యతలను ప్రజలు, అధికారులు, ఉద్యోగులపైకి నెట్టేశారని జనం చర్చించుకుంటున్నారు.

పీసా పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పీసా ఉపాధ్యక్షులు, సెక్రెటరీలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీసా కమిటీలు ఏర్పడి ఇన్నాళ్లైనా అధికారికంగా ఎటువంటి విధులు, బాధ్యతలూ వీరికి ప్రభుత్వపరంగా తెలియజేయలేదని ఏజెన్సీ నాయకులు అన్నారు. కమిటీలకు బాధ్యతలు అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పీసా చట్టాల గురించి వివరించారు. ఈ అవగాహన సదస్సులో ఏజెన్సీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, ఎం.ఉమామహేష్, మోహన్ పాల్, చిరంజీవి, లక్ష్మయ్య, సింహాచలం, తిరుమలరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ బిఎల్ఒగా విజయ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విజయ శ్రీలక్ష్మి రాష్ట్రస్థాయి ఉత్తమ బిఎల్ఒగా ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డును విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ఎన్నికల సంఘం అధికారులు చేతుల మీదుగా అందుకున్నారు. శ్రీలక్ష్మి ఉత్తమ అవార్డు రావడం పట్ల ఎంపిడిఒ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్, తోటి సచివాలయ ఉద్యోగులు అభినందించారు. మరోవైపు గుమ్మలక్ష్మీపురం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అల్లక లక్ష్మి మండల స్థాయి ఉత్తమ బిఎల్ఒగా ఎంపిక కావడం పట్ల సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్ అభినందించారు.

కుష్టు వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కుమ్మరిగుంట, తలవరం, పనస నందివాడ, హుస్సేన్‌పురం, కత్తుల కవిటి, ఎం.రాజపురం, యు.వెంకంపేట, చిదిమి, గడగమ్మ, కొట్టు గుమ్మడ తదితర గ్రామాల్లో శనివారం ముమ్మరంగా కుష్టు వ్యాధిపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలు గూర్చి వివరించారు.

పాలవలసకు పలువురి నివాళి

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి సీనియర్ నేత మాజీ జిల్లా పరిషత్తు అధ్యక్షులు పాలవలస రాజశేఖర్ సంస్మరణ సభ శనివారం స్థానిక ఎవిసి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ఘన నివాళి అర్పించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ సత్యనారాయణ, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాసు, మాజీ ఎమ్మెల్యేలు శంభంగి చినఅప్పలనాయుడు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులున్నారు.

120 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తున్న నాటుసారా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండలంలోని పొడ్డిశ, పూతికవలస గ్రామాల్లో అక్రమంగా రబ్బర్ ట్యూబుల్లో నిల్వ ఉంచిన 120 లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒకరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎక్సైజ్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకంపేటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేటలో శనివారం శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ శిల కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ శిబిరంలో పరిసర ప్రాంతాల నుంచి రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందిస్తూ చికిత్సలు కోసం శ్రీకాకుళం తరలించాలని కోరారు.

నేడు రైతు ప్రదర్శన

పార్వతీపురంరూరల్: రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పార్వతీపురంలో జరిగే రైతు ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, ఆయా సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బొడ్డవలస, గోచెక్క, లిడికివలస, తాళ్లబురిడీ, గ్రామాల్లో ప్రచారం చేశారు.

సూర్యారావు సేవలకు అవార్డు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు పెంటపాటి సూర్యారావుకు విశాఖపట్నం చెందిన టివి టూరిజం సంస్థ తరఫున భారత సేవా రత్న అవార్డును ప్రదానం చేశారు. సూర్యారావు చేసిన సేవలను గుర్తించి ఎంపిక చేసి విశాఖపట్నం దస్పల్లా హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు. ఆయనకు అవార్డు రావడం పట్ల వినియోగదారుల సంఘ సభ్యులు నల్ల మధుసూదనరావు, మన్యం రామకృష్ణ, గొర్లి అప్పలరాజు, మేడిశెట్టి ఈశ్వరరావు, వారణాసి శ్రీహరిరావు, ఊర్మిళమ్మ, తదితరులు అభినందనలు తెలిపారు.

సామాజిక బాధ్యతగా విద్య నేర్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సామాజిక బాధ్యతగా వయోవృద్ధులకు విద్యను నేర్పించాలని ఎంపిడిఒ బివిజె పాత్రో అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు రెండో విడత ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలకు వెళ్లే అవకాశాన్ని కోల్పోయిన 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పౌరులకు ప్రాథమిక అక్షరాస్యతను తీర్చిదిద్దడమే ఉల్లాస్ ఉద్దేశమని వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పదాల రామకృష్ణ, వెలుగు సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలి, తామరకండి, బగ్గందొరవలసలో పారిశుధ్య పనులను ఇఒపిఆర్డి కె వెంకట్ వర్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు కిరువైపులా పారిశుధ్య చెత్త చెదారాన్ని జెసిబితో తొలగించాలని, మంచినీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ శుభ్రం చేయించాలని తెలిపారు. అనంతరం సచివాలయాలను సందర్శించి సిబ్బంది రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.తిరుపతిరావు, డి.శ్రీనివాసరావు, ఎం.ప్రభాకర పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఎ.మన్మధరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో పుట్టిన తేదీలు, పేర్ల తప్పులు ఉండి అనేక పథకాలకు దూరమవుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం చక్కని అవకాశాన్ని కల్పించిందన్నారు. నీలకంఠాపురం పరిసర ప్రాంతాల్లో ఆధార్ సమస్యలున్నవారు సచివాలయానికి వచ్చి సరి చేసుకోవాలని కోరారు.

మండ పాఠశాలలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య ప్రాధాన్యత వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యమైన విద్యార్థులకు హెచ్ఎం పాలిక దేవానంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రిపబ్లిక్ డే సందర్భంగా శనివారం పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముఖ్య నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలు, ప్రకృతి అందాలు వంటివి బొమ్మలు విద్యార్థులు వేశారు. వీటిలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చిత్రలేఖనంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.ప్రసాద తదితరులు పాల్గొన్నారు.

ఓటే పౌరునికి వజ్రాయుధం

ప్రజాశక్తి - కురుపాం

ఓటు పౌరునికి వజ్ర ఆయుధం లాంటిదని, కావున 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ఎం.రవణమ్మ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించి ఓటు హక్కు, నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లయిన కర్రి సత్యంనాయుడు, గొర్లె రాములు, మరడాన చినబాబు సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, మండల ఆర్ఐ లక్ష్మణనాయుడు, ప్రసాద్, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుమ్మలక్ష్మీపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక భద్రగిరి ఆర్‌జిబిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేటింగ్ పోటీలను నిర్వహించారు.



గుమ్మలక్ష్మీపురం : ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఎల్విన్ పేట సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శేఖర్, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి. గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్యం గొప్పతనం గురించి తెలుసుకోవాలన్నారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పిల్లల్లో పూర్తిస్థాయి వికాసం పొందడానికి వారిలో స్ఫూర్తి నింపడానికి తగిన సూచనలు ఇచ్చారు. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ప్రణాళిక ప్రకారం చదువుకుంటే ఉత్తీర్ణత మీకే వరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ ఎస్.మల్లి, పాఠశాల ఉపాధ్యాయులు, హడ్డుబంగి మహిళా పోలీస్ సంధ్య పాల్గొన్నారు.

రంగవల్లి పోటీలు పాల్గొన్న సామరెల్లి విద్యార్థులు

మండలంలోని సామరెల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జాతీయ వాటర్స్ డే ఘనంగా నిర్వహించారు. పోలింగ్ గురించి ప్రధానోపాధ్యాయులు ఆరిక భాస్కరరావు వివరించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులచే ముగ్గులు, రంగవల్లి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

సీతానగరం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో సీతానగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు క్విజ్‌లో ద్వితీయస్థానాన్ని సాధించారు. గెలుపొందిన చినతాన్న, అవిష వెన్నెల, ప్రియాంక, జి.తనూజ, చందక దేవీ ప్రసాద్, గ్రీష్మ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ చేతుల మీదుగా మెమెంటోస్, సర్టిఫికేట్స్ అందుకున్నారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు నిచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జి.జగన్మోహనరావు, డి.రామారావులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇల్లా ప్రసన్నలక్ష్మిని, పాఠశాల యాజమన్య కమిటీ చైర్ పర్సన్ పలగర శ్రీదేవి అభినందించారు.

కురుపాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీలో కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శశిశ్రీ, రిషిత ద్వితీయ స్థానం సాధించగా మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో వీరు అవార్డులు అందుకున్నారని తెలిపారు.


పాచిపెంట: సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు

పాచిపెంట: పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఎంతో కీలకమని స్థానిక తహశీల్దార్ డి. రవి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక జెడ్పి పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు మానహారం నిర్వహించారు. సీనియర్ ఓటర్లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, పి తిరుమలరావు, వెంకటరమణ, విఆర్ఒ ప్రశాంత్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు బి ఈశ్వరరావు, బి ఎల్ఒలు విద్యార్థులు పాల్గొన్నారు.

మక్కువలో మానవహారం

మక్కువ: తహశీల్దార్ షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించి సీనియర్ ఓటర్లను సత్కరించారు. అనంతరం మక్కువలో ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, రీసర్వేడిటి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సుశాంత్ జాన, ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో విద్యార్తులు ర్యాలీ, మానవమారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు శంకరరావు పెద్ద ఎత్తున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూలీల ఇష్ట ప్రకారమే మేట్లను నియమించాలి

ప్రజాశక్తి -భామిని

ఉపాధి హామీలో వేతనదారులు కీలకం కావున, వారు అభీష్టం మేరకే నిబంధనలను అనుసరించి ఉపాధి హామీ మేట్లను నియమించాలని ఎంపిపి తోట శాంతికుమారి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సత్యం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మినీ గోకులాలను మండలంలో ఎవరెవరికి కేటాయించారనే అంశాన్ని సమావేశంలోనిప్రజా ప్రతినిధులకు తెలపాలని ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది మండలంలో జలజీవన్ మిషన్ పనులతో పాటు, పంచాయతీల్లో చేపట్టే పనులు, చెల్లింపులపై దృష్టి సారించాలని ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం కోరారు. ప్రస్తుతం మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల ద్వారా గర్భ కోసం వ్యాధులకు చికిత్సలు, నట్టలు నివారణకు మందులు, పశువుల సంరక్షణ, పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వచ్చేనెల విజయనగరంలో పాలపాటలు నిర్వహిస్తున్నామని, పది లీటర్ల పైబడి పాలిచ్చే రైతులు తమకు సంప్రదించాలని భామిని పశుసంర్ధకశాఖ అధికారి ఎం.సంతోష్ కుమార్ తెలిపారు. మండలంలోని మూడు పిహెచ్‌సిల పరిధిలో లెప్రసీ సర్వే, నాన్ కమ్యూనికబుల్ థిస్ ఇస్ సర్వే నిర్వహిస్తున్నామని, మిగతా సర్వీస్‌లు సక్రమంగా జరుగుతున్నాయని బాలేరు వైద్యురాలు దీపిక రాణి అన్నారు. పివిటిజిలో గల సవర, గదబ వారికి పిఎం జన్మన్ కింద ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2లక్ష 30వేలు చెల్లిస్తుందని హౌసింగ్ ఎఇ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మండలంలోని 54 గ్రామాల్లో తాగునీటి సౌకర్యం పూర్తి స్థాయిలో కల్పించేందుకు రూ.60 కోట్లతో జలజీవన్ యంత్రాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, మండలంలోని మిగిలిన 34 గ్రామాల్లో ఇతర పథకాల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పాపారావు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాదరావు, వైస్ ఎంపిపి బోనగెడ్డి ధర్మారావు, మజ్జి మోహన్‌బాబు, మండలి ప్రత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు, వెలుగు, ఉపాధిహామీ, ఆస్పిరేషనల్ బ్లాక్ సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

మేట్లపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

కూటమి ప్రభుత్వంలో ఉపాధి పథకం మేట్‌ల పైన కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు దాలయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూనేరు సంతలో శనివారం సిపిఎం, గిరిజన సంఘ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మేట్‌లను ఇష్టానుసారంగా తొలగించి, మార్పులు చేర్పులు చేశారని ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి ఉందని ఇటువంటి చర్యలు మానుకోవాలని కోరారు. జిల్లాలో ఉపాధి కూలీలకు కొత్త పనులు ఇవ్వాలని, పాత మేట్‌లను కొనసాగించాలని కోరారు. జిల్లా వ్యవసాయ పనులు పూర్తయి రెండు నెలలు కావస్తున్న నేపథ్యంలో పనులు లేక చాలా మంది వలసలు వెళ్లి పోతున్నారన్నారు. అందరికీ ఉపాధి పనులను కల్పించి పాత మేట్‌లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. పని చేసే చోట కూలీలకు సౌకర్యాలు కల్పించకపోతే ఉపాధి కూలీలను కదిలించి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సాంబమూర్తి, కూలీలు

పశువైద్య శిబిరాలతో పాడి రైతుకు మేలు

ప్రజాశక్తి - పాలకొండ

గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్యశిబిరాలు పాడి రైతులకు ఎంతో ప్రయోజకరమని జిల్లా పశు వైద్యాధికారి ఎస్ మన్మధరావు అన్నారు. మండలంలోని ఎన్‌కె రాజపురంలో జరుగుతున్న పశు వైద్యశిబిరాన్ని శనివారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు వెన్న శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు నీల అప్పారావు, పశుసంవర్ధక శాఖ ఎడి పి.మాణిక్యరావు, పశువైద్యాధికారులు బి.సిద్ధార్థ పాల్గొన్నారు. అదేవిధంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు రెండు గ్రామాల్లో 108 దూడలకు 55 పశువులకు వైద్య సేవలు అందించారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని ములగలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేషమైన ఆదరణ లభించింది. పశు వైద్యులు డాక్టర్ భోగి చక్రధర్‌రావు పర్యవేక్షణలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన పశువులను పరీక్షించి అవసరమైన వాటికి శాస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య కేంద్రాల్లో సేవలను తరచూ వినియోగించుకోవాలని, పాడి పశువుల అభివృద్ధిలో వైద్యులు సహకారం తీసుకోవాలని కోరారు. ఉచితంగా మందులు అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడక కృష్ణవేణి, విశ్వనాథం, విహెచ్ జయలక్ష్మి పాల్గొన్నారు.


సీతానగరం: పశువులను తనిఖీ చేస్తున్న వైద్యుడు

గరుగుబిల్లి: పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని బురదవెంకటాపురం సర్పంచ్ బొత్స లక్ష్మీ అన్నారు. మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆమెతో పాటు మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్ ప్రారంభించారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఈనెల 31వతేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం, వెంకటాపురంలలో శనివారం పశువుల వైద్య శిబిరాలను నిర్వహించారు. పశుసంవరక శాఖ ఏడి సిహెచ్ దీనకుమార్ మాట్లాడుతూ పాడి పశువుల రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భామిని : ప్రతి గ్రామంలో రైతులు వ్యవసాయంతో పాటు, పశువుల పెంపకం చేయాలని, తద్వారా గ్రామాల్లో పశు సంపద పెరిగి, రైతులకు ఆర్థికంగా బాగా ఉంటుందని ఇన్‌ఛార్జి పశుసంవర్ధకశాఖ అధికారి ఎం.సంతోష్ కుమార్ తెలిపారు. మణిగలో, వసి ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. శిబిరంలో గొర్రెలు, మేకలకు నట్టలు నివారణకు మందులు అందజేశారు. పశువులకే వ్యాక్సినేషన్ చేశారు. పశువుల పెంపకం సంరక్షణపై పాడి రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో యాని మల్ హస్బెండ్ అసిస్టెంట్, గోపాల మిత్రులు పాల్గొన్నారు.


పరిశ్రమను పరిశీలిస్తున్న విద్యార్థినులు

గ్రోత్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌ను శనివారం కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సందర్శించారని ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో గల బెర్రీ ఎల్లోయిస్ కంపెనీకి తీసుకుని వెళ్లి సందర్శించామన్నారు. అక్కడ కంపెనీ సిబ్బంది కంపెనీలో విధివిధానాలు, తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- సీతంపేట

జాతీయస్థాయి గిరిజన ఆదివాసి సాంస్కృతిక మహోత్సవాల గోడ పత్రికల ఐటిడిఎ పిఒ యస్వంత్ కుమార్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 5,6 తేదీలలో రాజమండ్రి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్‌టిఆర్ కన్వెన్షన్ ఆడిటోరియంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆదివాసి సాంస్కృతిక మహోత్సవాల గోడ పత్రికలను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గిరిజన సంస్కృతిక, సాంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు ఆదివాసి గిరిజన ప్రజలదేనని అన్నారు. రాజమండ్రిలో జరగనున్న జాతి స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్స కార్యక్రమాన్ని గిరిజన విద్యార్థులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కె.అక్కులప్పనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. విష్ణునాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.భగవాన్, మన్యం జిల్లా అధ్యక్షులు జి. భవానీ ప్రసాద్, సెక్రటరీ డి. వెంకటరమణ, ఐటిడిఎ ఎపిఒ జి.చినబాబు, డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, చిన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పిఒ

పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వెంకంపేట గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 20 టీములు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌ను సిఐ గోవిందరావు ప్రారంభించారు. ఫ్రెండ్లీ పోలీసులో భాగంగా తమ పరిధిలోని కొమరాడ, పార్వతీపురంలలో ఈ టోర్నీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు మౌలిక సదుపాయాలు ఏర్పాట చేసినట్లు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గోపాలపురం, పెద్దమరికి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. వీరికి సిఐ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి పైడాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండలంఓలని పి.కోనవలసలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ శనివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో మండలానికి సంబంధించి 31 టీంలు పోటీల్లో పాల్గొనగా వాటిలో దశల వారీగా క్వార్టర్ ఫైనల్‌కు 8 టీంలు, సెమీఫైనల్ నాలుగు టీంలు, ఫైనల్‌కు రెండు టీంలు చేరగా ఫైనల్‌కు చేరిన సరాయివలస, గరెల్లవలస టీంల మధ్య పోటీ జరగగా నేరెళ్లవలస టీం ఫైనల్‌లో విజయం సాధించింది. టీములు మధ్య పోటీ ఉత్కంఠభరితంగా జరిగింది. వచ్చిన టీంలన్నీ ఆట నియమాలను పాటించి సహకరించింది. ఈ టోర్నీకి పిడిలు ప్రతాప్, సన్యాసి, ప్రశాంత్ రిఫరల్‌గా నియమించారు. ఈ టోర్నీ చక్కగా నిర్వహించేందుకు ఎపిటిడబ్ల్యుఆర్ కాలేజీ ప్రిన్సిపల్ వివి మోహనరావు సహకరించారని ఎస్సై వెంకట సురేష్ తెలిపారు. టోర్నీ నిర్వహణలో సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ టోర్నీలో గెలిచిన గరెల్లవలస టీం పోలీసులు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి టోర్నీలో పాల్గొంటుంది.


పార్వతీపురం: విజేతలతో పోలీసులు

అగ్ని ప్రమాదాల నుంచి రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గ్యాస్, ఎలక్ట్రికల్ ద్వారా వాహనాల్లో, బస్సుల్లో జరిగే అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, మంటలను ఆర్పడంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వాహనచోదకులు వాహనం డ్రైవింగ్ చేసేటప్పుడు మెలకువలు పాటించాలని సూచించారు. ప్రతి స్కూల్ బస్‌లో తప్పనిసరిగా అగ్ని ప్రమాదాలను నివారించే యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని, మంటలను ఆర్పే యంత్రాలను తప్పనిసరిగా రెన్యువల్ చేయించాలని పేర్కొన్నారు. అనుకోని ఘటనలో వాహనాల నుంచి మంటలు వస్తే, మంటలను ఎలా ఆర్పాలో డ్రైవర్లకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. సుమారు 350 మంది స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లు, సిసి బస్సు, స్టేజి క్యారేజ్ బస్సు డ్రైవర్లకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. పొరబాటున జరిగే ప్రమాదాల నుంచి క్షతగాత్రులను రక్షించి వారికి నిస్వార్థంగా సేవ చేసే వారికి (గుడ్ సమారిటన్) ప్రభుత్వం రూ.5 వేల నగదు బహుమతి అందిస్తుందని ఆయన తెలిపారు. వాహన డ్రైవర్లకు ఆరోగ్యం, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్ ఇతర రహదారి భద్రతపై అవగాహన నిర్వహించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు, స్కూల్ పిల్లలను తరలించే వాహన డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని కోరారు. స్కూల్ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం వాహన చోదకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శశి కుమార్, జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి కాశిరాం నాయక్, ఎ.వరప్రసాద్, సహాయ ఇంధన శకట తనిఖీదారులు, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ సిబ్బం పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి

సూపర్ సిక్స్ అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బత్తిన మోహన్‌రావు కోరారు. శనివారం కాంగ్రెస్ నాయకులు వి.దాలి నాయుడు, తీళ్ల గౌరీ శంకరరావు, సాయి శ్రీనివాస్, పివి రమణ తదితరులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీలిచ్చిన పాలకులు అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కూటమి పాలన అవినీతిమయమైందని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలైన యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు, నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని కోరారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు